ప్రజాశక్తి
ఆదివారం 16 జూన్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నోటిఫికేషన్ సరే..

ఉపాధ్యాయ ఖాళీలపై స్పష్టతేదీ ?

చంద్రబాబు 'తొలి సంతకం' మెగా డిఎస్సిపై పలు ప్రశ్నలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి చేసిన 'తొలి సంతకం'పై నేడు సర్వత్రా చర్చ సాగుతోంది. నోటిఫికేషన్ విడుదలై.. ఉపాధ్యాయ నియామకాలు ప్రారంభమై.. స్కూల్ రిజిష్టర్‌లో ఉపాధ్యాయుడు సంతకం పెట్టే వరకూ ఎప్పుడూ టెన్షన్ వాతావరణమే కొన్నేళ్లుగా నెలకొంటోంది. గత ప్రభుత్వం డిఎస్సిపై జారీచేసిన జిఒ, సర్క్యులర్‌లను కొత్త ప్రభుత్వం రద్దు చేయాల్సి ఉంది. డిఎస్‌పి నోటిఫికేషన్‌పై టిడిపి కూటమి ప్రభుత్వం చేసిన ప్రకటన శుభపరిణామమే అయినా జిల్లాల వారీగా ఖాళీల వివరాలపై ఇప్పటికీ స్పష్టత కొరవడింది. ఖాళీల వివరాలను ప్రభుత్వం ఇంతవరకూ రప్పించుకునే ప్రయత్నం జరిగిందా ? అంటే లేదనే చెప్పాలి. విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులకు సైతం జిల్లాలో వివరాలపై స్పష్టత లేకపోగా ప్రభుత్వం కూడా కోరలేదన్న సమాధానం వారి నుంచి వినిపిస్తోంది.



గతంలో ఏం జరిగింది ?

జగన్ సర్కారు 172 సర్క్యులర్‌ను గతంలో ఇచ్చి 3 కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాలలను విలీనం చేసింది. ఈ నిర్ణయం సరైంది కాదని ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎంఎల్‌సిలు, యుటిఎఫ్ పెద్ద ఎత్తున పిల్లలు, వారి తల్లిదండ్రులతో రాష్ట్రంలోని అన్ని స్కూళ్లు, ఎంఆర్‌సిల వద్ద ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించలేవని రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను కూడా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఒక కిలోమీటరుకు పరిధిని తగ్గించారు. 117 జిఒను జగన్ మిగతా 2లో..



బీచ్ రోడ్డులోని శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, కవులు, కళాకారులు

మహనీయుడు శ్రీశ్రీ

పలుచోట్ల వర్థంతి సభలు - బీచ్ రోడ్డులో కవితా పఠనం

వార్తలు 4లో..

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

వార్త 2లో..

దర్పం కాదు.. దార్శనికత కావాలి

వార్త 2లో..

వాల్తేరు డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజన్‌లోని మెయిన్‌లైన్ కోటబొమ్మాళి - తిలారు సెక్షన్, చీపురుపల్లి యార్డ్, పుండి - పలాస సెక్షన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు చేయబడ్డాయి. కొన్ని షార్ట్ టెర్మినేటెడ్/రీషెడ్యూల్ అయ్యాయి. ఆ వివరాలను రైల్వే అధికారులు శనివారం వెల్లడించారు. ఆ మేరకు 07471 పలాస-విశాఖపట్నం ప్యాసింజర్, 07470 విశాఖపట్నం-పలాస ప్యాసింజర్, 08522 విశాఖపట్నం- గుణుపూర్ ప్యాసింజర్ రద్దయ్యాయి. అలాగే 08521 గుణుపూర్-విశాఖపట్నం ప్యాసింజర్, 18526 విశాఖపట్నం-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్‌లను జూన్ 17వ తేదీన, 18525 బ్రహ్మపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 18వ తేదీన రద్దు చేశారు. 18417 పూరీ-గుణపూర్ ఎక్స్‌ప్రెస్ జూన్ 17న షెడ్యూల్ సమయం 12:00 గంటలకు బదులు గంట ఆలస్యంగా మిగతా 2లో..



విశాఖలో రోడ్డుపై కూలిన చెట్టు

ఈదురుగాలులతో వర్షం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం ఈదురుగాలులతో జోరువాన కురిసింది. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి.

(వార్తలు 7లో..)

మొదటి పేజీ తరువాయి..

ఉపాధ్యాయ ఖాళీలపై స్పష్టతేదీ ?

సర్కారు ఇవ్వడం వల్ల పాఠశాలల విలీనంతో పోస్టులు చాలా వరకూ మిగిలిపోయాయి. హైస్కూల్స్‌లో చాలా పోస్టులు మెర్జ్ అయిపోయి ఉండిపోయాయి. ముఖ్యంగా జగన్ సర్కారు కేవలం ఇంగ్లీషు మీడియంను నిర్బంధంగా అమలు చేసింది. తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా నడిపించగలిగితే తప్ప పాఠశాలలు మనలేవన్న డిమాండ్ యుటిఎఫ్, ఇతర సంఘాల నుంచి వినిపించింది.

వాటిని రద్దు చేస్తేనే పాఠశాలలకు మనుగడ

పాఠశాలల భవిష్యత్తు కోసం రెండు మీడియంలను సమాంతరంగా నిర్వహించాలి. గత ప్రభుత్వం 172 సర్క్యులర్, 117 జిఒలను తేవడం వల్ల పోస్టులు చాలా మిగిలిపోయాయి. కాబట్టి వాటిని రద్దు చేయాలి. వీటిపై ప్రతిపక్షంలో ఉండగా నిర్వహించిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నెరవేర్చాలి. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల నమోదు కూడా గతంలో సరిగ్గా లేదని ప్రైవేట్ వాళ్లు పిల్లలను పట్టుకెళ్లిపోయారు. అమ్మకు వందనం పథకం కూడా కొత్త ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లకే పరిమితం చేయాలి.

టిఆర్.అంబేద్కర్,
యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి

వాల్తేరు డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

మధ్యాహ్నం 13:00 గంటలకు పూరీ నుండి బయలుదేరుతుంది. 07225 సికింద్రాబాద్-షాలిమార్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ జూన్ 17న షెడ్యూల్ సమయం ఉదయం 04:30 గంటలకు బదులుగా రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 06:30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. 07234 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ జూన్ 16న షెడ్యూల్ సమయం రాత్రి 23:40 గంటలకు బయలుదేరడానికి బదులుగా 4 గంటలు ఆలస్యంగా జూన్ 17 తెల్లవారుజామున 03:10 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది.

18117 రూర్కెలా-గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ జూన్ 16న పలాసలో షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది. 18118 గుణుపూర్-రూర్కెలా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ జూన్ 17న గుణుపూర్‌కు బదులుగా పలాస నుండి బయలుదేరుతుంది. అందువల్ల పైన పేర్కొన్న తేదీలో గుణుపూర్-పలాస మధ్య ఈ రైలు సర్వీసు లేదు.

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలుగా వెంకటలక్ష్మి


వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), విశాఖ జిల్లా అధ్యక్షురాలుగా ఎం.వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో వెంకటలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల యూనియన్ అధ్యక్షురాలు వై.తులసి ఆకస్మికంగా మరణించిన నేపథ్యంలో నూతన అధ్యక్షురాలిని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నూతన ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, వేధింపులు, కక్ష సాధింపు చర్యలు అరికట్టాలని కోరారు. అంగన్‌వాడీ త్రిఫ్ట్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి నాగశేషు మాట్లాడుతూ త్రిఫ్ట్ నుంచి డెత్ బెనిఫిట్ కింద తులసి కుటుంబానికి రూ.40,493 అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా యూనియన్‌గా త్రిఫ్ట్ సొసైటీని ఏర్పాటు చేసి అంగన్‌వాడీ వర్కర్స్‌ను, హెల్పర్స్‌ను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సభ్యులందరూ త్రిఫ్ట్‌లో చేరాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భీమిలి ప్రాజెక్ట్ నుంచి నరసియమ్మను జిల్లా సహాయ కార్యదర్శిగా సమావేశం ఎన్నుకుంది. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ సలహాదారు బృంద, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు పి.మణి, ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు శోభారాణి, కోశాధికారి పద్మ పాల్గొన్నారు.

చిన్నారిని పరామర్శించిన ఎంపీ తనూజరాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అగంతకుల దాడిలో గాయపడి కెజిహెచ్ గైనకాలజీ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారిని అరకు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ గుమ్మ తనూజరాణి శనివారం పరామర్శించారు. కెజిహెచ్ సూపరిండెండెంట్ డాక్టర్ శివానందతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించవలసిందిగా కోరారు. చిన్నారి ఆరోగ్యం కుదుటగానే ఉన్నట్టు కెజిహెచ్ ఆసుపత్రి వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా ఎంపీ తనూజరాణి మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మానవ సమాజంలో చిన్నారులపై ఇలాంటి దుర్ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. ఎంపీ వెంట వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ వున్నారు.


ప్రజాప్రతినిధులకు అభినందనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కల్లు గీత సామాజిక తరగతికి చెందిన రాష్ట్ర నూతన రెవెన్యూ శాఖ మంత్రి అనిగాని సత్యప్రసాద్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, శాసనసభ్యులు గౌతు శిరీష, పితాని సత్యనారాయణ, కెఇ.శ్యాంబాబు, కాగిత కృష్ణప్రసాద్‌లకు శ్రీశైన సంక్షేమ సేవా సంఘం విశాఖపట్నం నాయకులు తోట వాసుదేవరావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దర్పం కాదు.. దార్శనికత కావాలి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మంత్రివర్గ కూర్పు ఉమ్మడి విశాఖ జిల్లాలోని సీనియర్ల ఆశలను తలకిందులు చేసింది. అనుభవం, పార్టీ విధేయత కంటే నమ్రతకు చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లుంది. చంద్రబాబు, లోకేష్‌కు అత్యంత విశ్వసనీయమైన వ్యక్తిగా గుర్తింపు పొందిన పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు కీలకమైన హోం, విపత్తుల నిర్వహణ శాఖ లభించింది. ఇక తనదాకా మంత్రి పదవిరాదని గ్రహించేమో, సీనియర్లకు పదవులిస్తే, కొత్త వారికి అవకాశాలెప్పుడు వస్తాయంటూ అయ్యన్న తనకుతాను సర్ధిచెప్పుకున్నారు. ఇంతకంటే మరో దారి అయ్యన్నకు కన్పించివుంటే, ఆయన ప్రతిస్పందన మరోలా వుండేది. అయ్యన్న వంటి సీనియర్లను పక్కనబెట్టడం మంచిదికాదనేమో, తరువాత చంద్రబాబు పిలిచి తగిన గుర్తింపు సీనియర్లకు ఇస్తామని చెప్పి పంపించారు. స్పీకర్ పదవి ఆశ అయ్యన్నకు లేకపోలేదు. అందుకనే మంత్రివర్గంలో స్థానం దొరక్కపోయినా దిగులుతో కనబడకుండా ధీరత్వం ప్రదర్శిస్తున్నారు. మరోవైపు ఆశావహుల్లోని నిరాశను వదిలించేందుకు చంద్రబాబు సంస్థాగత దిద్దుబాటు ప్రారంభించినట్లుంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును మంత్రివర్గంలోకి తీసుకోవడంతో ఆ అధ్యక్ష స్థానాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో భర్తీచేసి సంతృప్తిపర్చాలని చూస్తున్నారు.

ఇకపోతే... కక్షలు, ప్రతీకారాలు వుండవంటూనే తప్పుచేసిన వారెవరినీ వదిలిబెట్టబోమని బెదిరింపులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. తప్పు ఎవరు చేసినా, ఎప్పుడు చేసినా తప్పించుకోడానికి వీల్లేని వ్యవస్థలను బలహీనం చేస్తున్నది పాలక ప్రభుత్వాలే. తప్పు చేసిన తమ వారిని కాపాడ్డం, కాని వారిని బాధ



పెట్టడం పరిపాటిగా మారడంతో ఆ కొద్దిమంది ఎప్పుడూ తమకనుకూల కాలంలో చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ పెద్దల మనసెరిగి మసలుకొని బతకడానికి అలవాటుపడ్డ అధికారులు సందర్భతీరును బట్టి ప్రతిస్పందిస్తున్నారు. అనేక నెలల పాటు సిరిపురం జంక్షన్‌కు వెళ్లే మార్గాన్ని స్టాపర్లతో మూసినప్పుడు కళ్లు తెరవని పోలీసులు ప్రభుత్వం మారగానే కళ్లు తెరిచి వాటిని తొలగించిన తీరు చూస్తుంటే అధికారమెంత భయంకరంగా మనుషులను విన్యాసాలు చేయిస్తుందో అర్ధమవుతుంది. చేసింది తప్పని తెలిసినా, సరిదిద్దడానికి కూడా సాహసించలేని, ధైర్యంలేని ఆ ప్రభుత్వ యంత్రాంగం దేనికి ? అధికార పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసుకొని, కాలక్షేపం చేయడానికా ? చట్టపరిధిలో పనిచేయాల్సిన యంత్రాంగం వెన్ను ఎముకలేనిదిగా వ్యవహరించబట్టే, రాజకీయ నాయకుల తప్పులకు నియంత్రణ లేకుండాపోతోంది. పాలనా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన వారే ప్రతీకారం తీర్చుకుంటామని చట్టానికి అతీతుల్లా మాట్లాడం ప్రజాస్వామ్య విలువలకు ప్రమాదం. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సిట్ వేసిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రెండూ ఆ నివేదికను బహిర్గతం చేయలేదంటే ఇవి ఎవరిని రక్షిస్తున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలి.

'తల్లియున్నయపుడె తనదు గారాబాము, లామె పోవదన్ను నరయరెవరు, మంచికాలమపుడె మర్యాదనార్జింపు' అని వేమన చెప్పినట్లు తల్లి బతికివున్నప్పుడు పిల్లల గారాబము సాగినట్లు, కాలం కలిసి వచ్చినప్పుడే గౌరవ మర్యాదలు ఆర్జించుకోవాలి. లేదంటే అవెందుకు పనికిరాకుండా పోతాయి. కక్షలూ, కార్పణ్యాలు వదిలి ఉమ్మడి విశాఖ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలుజరిగేలా పట్టుబట్టి సాధించినప్పుడే ఎన్నికైన వారికి గౌరవం దక్కుతుంది.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు


ఉపకార వేతనాలను అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చదువుతోనే మంచి భవిష్యత్తు సాధ్యమని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో అర్హులైన, వెనుకబడిన విద్యార్థులకు వార్షిక స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం శనివారం సాయంత్రం వెంకోజీపాలెంలోని సిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీభరత్ విద్యార్థులతో మాట్లాడారు. వారి భవిష్యత్తు కార్యాచరణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను, ముఖ్యంగా ఆడపిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ సేవలను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సొసైటీ అధ్యక్షులు ఐహెచ్.ఫరూకీ, కార్యదర్శి జాఫర్ హుస్సేన్, కోశాధికారి రియాజ్ ఖాన్ పాల్గొన్నారు.


బాధ్యతలు చేపట్టిన విసిసిఐ నూతన మహిళా కార్యవర్గ సభ్యులు

విసిసిఐ మహిళా కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజాగపటం ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (విసిసిఐ) మహిళా విభాగం నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షులు జీజా వల్సరాజ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యదర్శి అనిలా నార్ల, కోశాధికారి కవితా ఖారా 2023-24 సంవత్సర ముగింపు నివేదికను అందించారు. అనంతరం నూతన కార్యవర్గం నుంచి అధ్యక్షురాలు సంధ్యా రవి గోడే, ఉపాధ్యక్షురాలు అనిలా నార్ల, కార్యదర్శి పర్వీన్ హుస్సేన్, కోశాధికారి వాణి కంచర్ల, కమిటీ సభ్యులు ప్రేరణ బైద్, మేఘనా ఓజా, రీతిక కూర్మినాయుడు, రజినీ చిత్ర, పర్విన్ రాజులు, నీతూ సింగ్ ఐపిసి జీజా వల్సరాజ్ నేతృత్వంలో కొత్త బృందం బాధ్యతలు స్వీకరించింది. ఈ కార్యక్రమంలో విసిసిఐ అధ్యక్షుడు సుదర్శన్ స్వామి, ఉపాధ్యక్షుడు కంచర్ల కృష్ణకుమార్, కార్యదర్శి రోలాండ్ విలియమ్స్, రియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణురాలై కాలేజీలో అడుగు పెట్టే సమయంలో మత్స్యకార కుటుంబానికి చెందిన దగులుపిల్లి భార్గవి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో హాస్పిటల్‌లో చేరి చావుబతుకుల మధ్య దయనీయ స్థితిలో ఉందన్న విషయం తెలిసి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ స్పందించారు. రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే తన మిత్ర బృందం సహకారంతో మరో రూ.29 వేలు సమకూర్చారు. ఆ మొత్తం రూ.59 వేలను జోడుగుళ్లపాలెంలో ఉంటున్న భార్గవి తల్లిదండ్రులు కొండమ్మ, అప్పారావు దంపతులకు అందించినట్లు ఎయుటిడి సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా జోడుగుళ్లపాలెం ప్రజలు ఇఎఎస్.శర్మకు ధన్యవాదాలు తెలిపారు.

మత్స్యకార భరోసా వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జీవన భృతి, మత్స్యకార భరోసా వెంటనే చెల్లించి మత్స్యకారులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు జీవన భృతి కింద రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న మత్స్యకార భరోసా ఆర్థిక సహాయం కొన్ని సాంకేతిక కారణాల వల్ల అందలేదని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తమకు న్యాయం చేయాలని గణేష్ కుమార్‌కు శనివారం మత్స్యకార కళాసీలు వినతి పత్రం సమర్పించగా ఆయన స్పందించి వెంటనే ఆ విషయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున దృష్టికి తీసుకొచ్చారు.

కార్యకర్తకు రూ.10 వేలు ఆర్థిక సాయం

దక్షిణ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వైసిపి కార్యకర్తకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. 33వ వార్డు పిల్లివారి వీధికి చెందిన కొల్లు సత్యవతి అనారోగ్యం చెందడంతో వార్డు నాయకులతో కలిసి శనివారం ఆమె ఇంటికి వెళ్లి భరోసా కల్పించారు. కార్యక్రమంలో బొడ్డేటి కిషోర్, రమేష్, రాము పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. ప్రచారానికే పరిమితం...

ప్రజాశక్తి -మధురవాడ : పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే ప్లాస్టిక్ నిషేధం ప్రచారానికే పరిమితమవుతోంది. భావితరాల మనుగడను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యమంటూ ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు కావడం లేదు. ఏడాదిలో కొద్ది రోజులు పాటు అధికారులు నిషేధంపై హడావుడి చేయడం తప్ప ఆశించిన ప్రయోజనం లభించడం లేదు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. మొదట 50, తర్వాత 75, ఇప్పుడు 125 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని నిషేధం విధించినా.. అవి యథేచ్ఛగా వాడుకలో ఉంటున్నాయి.

ప్లాస్టిక్ విక్రయదారులు, వ్యాపారులు, ఫ్లెక్సీ ముద్రణదారులతో అధికారులు మూడేళ్ల కిందట సంయుక్త సమావేశాలు ఏర్పాటుచేశారు. నిషిద్ధ ప్లాస్టిక్ చేతి సంచులు, గ్లాసులు, ఇతర ఉత్పత్తులు వినియోగించరాదని హెచ్చరించారు. వాటి అమలుకు ఆయా జోన్ల వారీగా అధికారులను బృందాలుగా ఏర్పాటుచేసి నిరంతర తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై అపరాధ రుసుం వసూలు చేసేవారు. దీంతో వ్యాపారులు, ప్రజల్లో సైతం దీనిపై అవగాహన ఏర్పడడంతో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం క్రమంగా తగ్గుముఖం పట్టింది. రైతుబజార్లు, మార్కెట్లకు వెళ్లే వినియోగదారులు గుడ్డ, నార సంచులు తీసుకు వెళ్లేవారు. క్రమంగా తనిఖీలు మొక్కుబడిగా సాగడంతో మళ్లీ ప్లాస్టిక్ వినియోగం యథాస్థితికి వచ్చేసింది. ఫలితంగా నగరంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్



నిషిధిత ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్తున్న కూరగాయలు

సంచులు దర్శనమిస్తున్నాయి. కాలువలు, గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయి పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోంది. ప్లాస్టిక్ సంబంధిత సంచులపై సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, ఎన్ని మైక్రాన్లో ముద్రించి ఉండాలి. రీసైక్లింగ్ సంచులపై పునరుత్పత్తి చేసినట్లు తెలపాలి. ప్లాస్టిక్ వస్తువులు తయారుచేసే పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తే.మొదటిసారిగా రూ.50 వేల జరిమానా, అనంతరం లైసెన్స్ రద్దు, టోకు, చిల్లర వ్యాపార దుకాణదారుడికైతే రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు అపరాధ రుసుం, అదే విని యోగదారుడి చేతిలో ప్లాస్టిక్ సంచి కనిపిస్తే రూ.200 నుంచి రూ.500 వరకు జరిమానా విధించాలని నిబంధనలున్నాయి. అయినా ప్లాస్టిక్ వినియోగించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దాడులు చేసే సమయంలో అధికారులు నామమాత్రపు చర్యలకు పరిమితమయ్యారు. ప్రస్తుతం కిరాణా, కూరగాయలు, మాంసం దుకాణాల్లో వీటి వినియోగం పెరిగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్లాస్టిక్ నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయించరాదని వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాం. ఆకస్మిక తనిఖీలు చేసి విక్రయదారులకు జరిమానా విధిస్తున్నాం. జోన్-2 పరిధిలోని నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం తగ్గుముఖం పట్టింది.



శైలజా వల్లి
జోన్ -2 కమిషనర్



పార్టీ నాయకుల మధ్య కేక్ కట్ చేసిన లక్ష్మణరావు

ఘనంగా లక్ష్మణరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కోరాడ గ్రామ సర్పంచ్, వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణ పుట్టిన రోజు వేడుకలు శనివారం తన ఇంటి వద్ద ఘనంగా నిర్వహించారు. మండల స్థాయి నాయకులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



జాతీయరహదారి పక్కన ఏర్పాటు చేసిన ఎద్దుబండి బొమ్మ

ఆకట్టుకుంటున్న ఎద్దు బండి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈ చిత్రాన్ని చూస్తే అచ్చంగా ఒక ఎద్దు బండిని లాగుతూ బ్రిడ్జిపై ప్రయాణం చేస్తున్నట్టు కనిపిస్తుంది. అలా అనుకుంటే పొరపాటే. ఇది నిజంగా ఎద్దు బండి కాదు. జాతీయరహదారి ఆనుకొని ఉన్న పాతడెయిరీఫారం కూడలి వద్ద జివిఎంసి సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఎద్దు బండి బొమ్మ. జాతీయరహదారిని ఆనుకొని ఉన్న ఖాళీప్రదేశంలో చుట్టూ రెయిలింగ్ ఏర్పాటుచేసి ఈ బుల్లక్ కార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఆదర్శనగర్ నుంచి జాతీయరహదారి వైపు వచ్చిన ప్రయాణికులకు, వాహనదారులకు ఒక బ్రిడ్జిపై నిజంగా ఎద్దు బండి ప్రయాణిస్తున్నట్టు కనిపిస్తుంది. జాతీయరహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులను ఆకర్షిస్తుంది.

నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామం గొట్టిపల్లి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో బాల వికాస్ విద్యార్థులకు స్థానిక భజన మండలి ఆధ్వర్యాన శనివారం పలువురు సాయి భక్తులు సహకారంతో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. దాతలు సాయి భక్తులు పిఎస్ఎన్ మూర్తి, కొట్యాడ లక్ష్మణమూర్తి, బిఎల్.రాజు సమకూర్చిన 200 నోటు పుస్తకాలను 40 మంది బాలవికాస్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రుత్తల సన్యాసిరావు, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడుబాబు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల జోన్ కో-ఆర్డినేటర్ మానాపురం సత్యసాయి కుమార్, ఆదర్శ గ్రామ కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్‌కుమార్, భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్ము నాయుడు, కో- కన్వీనర్ డిపి రాజు, యూత్ కో-ఆర్డినేటర్ డి.శరత్‌కుమార్, బాల్ వికాస్ ఇంచార్జ్ డివి సంతోష్ కిరణ్, సేవాదళ్ కో-ఆర్డినేటర్ డి కార్తీక్, మహిళా సేవాదళ్ లాస్య, సీనియర్ ఉపాధ్యాయులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'డిఎస్‌సి అభ్యర్థుల కల సాకారం'

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకం కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న డిఎస్‌సి అభ్యర్థుల కల టిడిపి ప్రభుత్వ హయాంలో నెరవేరనుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డిఎస్‌సి ఫైల్‌పై తొలి సంతకం చేసి నిబద్ధతను చాటుకున్నట్లు వివరించారు.

ముసుగు తొలగించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న మాజీ ఎంఎంసి ఛైర్మన్ మొకర నారాయణరావు విగ్రహానికి ధరించిన ముసుగును తొలగించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ ముగిసిందని, వచ్చే నెల 6వ తేదీన ఆయన వర్ధంతి నిర్వహించనున్న క్రమంలో ఆయన విగ్రహానికి ముసుగు తొలగించాలని కోరారు.

పిటీ కేసుల పేరుతో అపరాధ చలానాలు

ఆగ్రహం వ్యక్తంచేస్తున్న వాహనదారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : పిటీ కేసుల పేరుతో పోలీసులు ఎక్కడికక్కడ ద్విచక్రవాహనాలను అడ్డుకొని ఫొటో తీసి వెంటనే అపరాధ రుసుం చలానాలు పంపిస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఆరిలోవ పోలీస్‌స్టేషన్ ఎదురుగానే ద్విచక్రవాహనాలను ఆపేసి హెల్మెట్ లేదని చెప్పి ఫొటో తీయడం, అపరాధ రుసుం చలానాలను వసూలు చేయడం చేస్తున్నారు. ఆరిలోవ ప్రాంతంలో చాలా మంది తమ ఇళ్ల నుంచి రోడ్డు మీదకు వచ్చి బజారు చేయడం, ఇతర చిన్న చిన్న అవసరాలకోసం వాహనాల మీద బయటకు వస్తుంటారు. ఇక్కడికక్కడే హెల్మెట్‌లు ఎలా ధరిస్తామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలకు తమకు తెలియకుండానే ఏదో మూల నుంచి ఫొటోలు తీసి ఆన్‌లైన్లో అపరాధ రుసుం చలానాలు పంపించడం పట్ల వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రధాన రహదారులు, జాతీయరహదారుల్లో బయటకు వెళ్లేవారు హెల్మెట్ పెట్టకపోతే అపరాధ రుసుం వేయవచ్చుకానీ స్థానిక రోడ్లపై వేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. వాహనాల తనిఖీ పేరుతో సడన్‌గా వాహనాలు ఆపేయడంతో చాలా మంది భయపడి సడన్ బ్రేక్ వేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పైఅధికారుల మెప్పు కోసం, టార్గెట్లు పూర్తిచేయడం కోసం ఎక్కడపడితే అక్కడ వాహనాలను ఆపేసి ఇలా అపరాధ రుసుం వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణ గోడపై నోటీసు

వారం రోజుల్లో తొలగించకుంటే కూల్చేస్తాం : రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం సమీపం వీతం కళాశాల రోడ్డులో గల సాలోడు చెరువును ఆక్రమించి రియల్ ఎస్టేట్ దారులు అక్రమంగా నిర్మించిన గోడపై రెవెన్యూ అధికారులు నోటీసు అంటించారు. వారం రోజుల్లో తొలగించాలని హుకుం జారీచేశారు. మిందివానిపాలెం సర్వే నెంబరు 347లో సుమారు 452 ఎకరాల విస్తీర్ణం చెరువు గయాలు ఉంది. ఈ స్థలాన్ని ఆనుకొని 319/1 లో సుమారు 8 ఎకరాలు విస్తీర్ణంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నాలుగు రోజులుగా గోడ నిర్మాణ పనులు చేపట్టడంపై పత్రికల్లో వచ్చిన కథనాలు, గ్రామస్తుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ మణికంఠ, విఆర్ఒ వరలక్ష్మి ఆక్రమణ స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ గోడను వారం రోజుల్లో తొలగించకపోతే తామే కూల్చుతామని కట్టిన గోడపై నోటీసును అంటించారు.



గోడకు నోటీసు అంటిస్తున్న రెవెన్యూ అధికారులు

వెంకటాపురంలో రామాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వెంకటాపురంలో రామాలయం వార్షికోత్సవాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ అలంకరణ, మామిడి తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 5000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు గంగరాజు పాల్గొన్నారు.

పైపులైను పగిలి నీరు వృథా

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం శ్రమజీవులు కాలనీలో మంచినీటి పైపులైను పగిలి పది రోజులుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. శ్రమజీవులు కాలనీలో ఇటీవల రోడ్డు పనులు ప్రారంభించడంతో పైపులైన్లు కొత్తగా అమర్చారు. పంచాయతీ అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సచివాలయంలో బీసీజీ వ్యాక్సిన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : టీబీ వ్యాధి నిర్మూలనకు బీసీజీ వ్యాక్సిన్ ప్రతి సోమవారం నుంచి గురువారం వరకు అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయని మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సచివాలయాల్లో, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సచివాలయం, హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లలో అందుబాటులో ఉంటుందని వివరించారు. గత ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, 18 ఏళ్లు నిండిన వారు, పొగ తాగేవారు, సుగర్ వ్యాధి ఉన్న వారు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్నవాళ్ళు, టీబీ పేషెంట్‌తో దగ్గరగా ఉన్న వారు బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని మధురవాడ టీబీ యూనిట్ సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం తెలిపారు. మధురవాడ టీబీ యూనిట్ పరిధిలో ఉన్న 10 యుపిహెచ్‌సిలైన సాగర్ నగర్, రుషికొండ, పిఎం.పాలెం, వాంబే కాలనీ, స్వతంత్ర నగర్, మిథిలాపురి, విశాలాక్షి నగర్, మారికవలస, బక్కన్నపాలెం సచివాలయాల్లో కూడా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకుంటే టీబీ బారిన పడకుండా ఉంటారని పేర్కొన్నారు.

'కళింగ సామాజిక తరగతికి అన్యాయం'

ప్రజాశక్తి-మధురవాడ : రాష్ట్ర మంత్రి వర్గంలో కళింగ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీపాన వెంకటరమణ పేర్కొన్నారు. కార్యవర్గం అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 80 శాతం ఓట్లు ఉన్న కళింగ కమ్యూనిటీకి ఉన్నాయన్నారు. కళింగ కమ్యూనిటీ నుంచి కూన రవికుమార్, బెందాల అశోక్ కుమార్ గెలిచినా ఒకరికైనా కేబినెట్‌లో స్థానం కల్పించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఓటు బ్యాంకు ఉన్న కళింగ కమ్యూనిటీని గుర్తించకపోవటానికి కారణమేమిటో చంద్రబాబు వివరించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ డిఎస్‌పి ఎస్‌వివి.ప్రసాదరావు మాట్లాడుతూ, ఇప్పటికైనా చంద్రబాబు స్పందించి కళింగ కమ్యూనిటీకి కేబినెట్లో స్థానం కల్పించి గుర్తించాలని కోరారు.



సీతమ్మధారలో గాలివానకు నేలకొరిగిన చెట్లు


వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : శనివారం ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. సాయంత్రం పడిన వర్షానికి ప్రజలందరూ కాసేపు చల్లదనాన్ని ఆస్వాదించారు. సీతమ్మధార, పౌర గ్రంథాలయంలో చెట్లు పడిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వెంటనే స్థానిక ప్రజలు స్పందించి చెట్లుకొమ్మలు తొలగించారు. పౌర గ్రంథాలయంలో పడిపోయిన చెట్టును విద్యార్థులు తొలగించారు.

ఉరుములతో కూడిన గాలి వాన

పెందుర్తి : 97, 95, 94, 93, 92 వార్డు పరిధి పెందుర్తి, చినముసిడివాడ, పురుషోత్తపురం, వేపగుంట నాయుడుతోట తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షంతో ఒక్కసారిగా ఉపశమనం పొందారు. చిరు జల్లులు కారణంగా తర్వాత ఉక్కపోతతో అల్లాడారు. గత కొద్దిరోజులుగా ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో ఈ చిరుజల్లులకు ఆవిరి బయటకు రావడంతో ఒక్కసారిగా ప్రజలు ఉక్క పోతతో అల్లాడిపోయారు.



రక్తదాతలకు సర్టిఫికెట్, పూలమొక్కలు అందిస్తున్న గుంటూరు

సరిపల్లిలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని సరిపల్లి గ్రామంలో శనివారం మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా సరిపల్లి యూత్ ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారు. నగరానికి చెందిన వైద్యులు గ్రామానికి వచ్చి యువతకు రక్తదానంపై అవగాహన కల్పించి చైతన్యం నింపారు. విశాఖ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుంటూరు వెంకట నరసింహమూర్తి చేతులమీదుగా రక్తదాతలకు సర్టిఫికెట్లు, పూలమొక్కలు పంపిణీ చేశారు. దాతలకు శీతలపానీయాలు గుంటూరు వెంకట నరసింహమూర్తి పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరిపల్లి సహ చుట్టుపక్కల గ్రామాలలో మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

పంచకర్లను కలిసిన ఎంఇఎ

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సీతమ్మధారలోని స్వగృహంలో పెందుర్తి మండల ఎంఇఎ మధుమూర్తి, మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, విశాఖపట్నం జిల్లా పిఆర్‌టియు ఉపాధ్యాయుల యూనియన్ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు.



ఎమ్మెల్యే పంచకర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఇఎ తదితరులు

మహనీయుడు శ్రీశ్రీ

మహా కవి శ్రీశ్రీ 41వ వర్ధంతిని పురస్కరించుకుని విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం పలుచోట్ల సభలు, సమావేశాలు నిర్వహించారు. బీచ్ రోడ్డులో నిర్వహించిన కవితా పఠనం ఆకట్టుకుంది. సమాజాన్ని తన రచనలతో మేల్కొలిపిన గొప్ప మహనీయుడు శ్రీశ్రీ అని వక్తలు కొనియాడారు.

పలుచోట్ల వర్ధంతి సభలు - బీచ్ రోడ్డులో కవితా పఠనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీశ్రీ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం బీచ్ రోడ్‌లోగల శ్రీశ్రీ విగ్రహం వద్ద సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు ఆధ్వర్యంలో కవితా పఠన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, స్వతంత్ర కుమార్ శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శర్మ శ్రీశ్రీ అమూల్యమైన కవితలను చదువుతూ వాటిలోని సందేశాన్ని వివరించారు యువ కవులకు స్ఫూర్తినిచ్చే సూచనలు చేశారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ శ్రీశ్రీ సాహితీ సంస్మరణను, కవితా పటిమను ప్రస్తుతిస్తూ కవితా పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కవితా పఠనంలో నగరంలోని ప్రముఖ సాహితీ సంస్థల కవులు రొంగలి రాములు, బొడ్డ కూర్మారావు, సి.హెచ్.చిన సూర్యనారాయణ, రెడ్డి రామకృష్ణ, పిఎల్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజానాట్యమండలి ఘన నివాళి

ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లో ఉన్న శ్రీశ్రీ విగ్రహం వద్ద అభ్యుదయ, దేశభక్తి, శ్రీశ్రీ పాటల కచేరీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, అధ్యక్షులు జి.రమణ, గురజాడ సాంస్కృతిక వేదిక నాయకులు దండు నాగేశ్వరరావు, సాహితీ స్రవంతి జిల్లా నాయకులు పెంటకోట రామారావు, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు గోపాలరావు, స్టాలిన్, లోకేష్, శ్రీకాంత్, గణేష్, ఎన్‌వి.రమణ, ఎం.నాగేశ్వరరావు వై.అప్పారావు, పి.వి.రమణ, సుమిత్ర, మౌనిక పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు, ప్రజా గాయకులు ఆలపించిన పాటలు చైతన్యం నింపాయి.

సీతమ్మధార : ఆచార్య చందు సుబ్బారావు సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా పౌర గ్రంథాలయంలో శనివారం సాహిత్య సభ నిర్వహించారు. 'ఆధునిక సాహిత్య వైతాళికుడు శ్రీశ్రీ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. యుపిఎస్‌సి పూర్వ సభ్యులు ఆచార్య కెవిఎస్.చలం అధ్యక్షత వహించిన ఈ సభలో ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య చందు సుబ్బారావు, ప్రముఖ కవి, విశ్లేషకులు గరిమెళ్ల నాగేశ్వరరావు, కథకులు మేడా మస్తాన్ రెడ్డి, ఉప్పల అప్పలరాజు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం పరవాడలో సిఐటియు ఆధ్వర్యాన శనివారం శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రామిక పీడిత వర్గాలకోసం శ్రీశ్రీ అనేక రచనలు చేశారన్నారు. అల్లూరి సీతారామరాజు చిత్రంలో తెలుగువీర లేవరా గేయానికి తొలిసారి జాతీయ పురస్కారం లభించిందని చెప్పారు. శ్రీశ్రీ విశాఖవాసి కావడం ఈ ప్రాంత ప్రజలు గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పైడి లక్ష్మి, నీలిమ, అరుణ, రవణమ్మ, మధురమ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు



పరవాడలో మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

అనకాపల్లి : ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ శ్రీశ్రీ శ్రమజీవుల గొంతుక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు కండేపల్లి త్రినాథ్, వి.పోతురాజు, సత్యనారాయణ, రమణ, జివి.రావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు, మాణిక్యాలరావు, సూరిబాబు, జగదీష్ పాల్గొన్నారు.

ఎంవివి కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై పునర్విచారణ చేపట్టాలి

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై పునర్విచారణ చేపట్టాలని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. పౌర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆ కిడ్నాప్ అంతా ఒక డ్రామా అని ఆరోపించారు. వైసిపి పెద్దలు ఆడిన నాటకం అన్నారు. అప్పటి పోలీసు అధికారులు ఎంవివితో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నిందితుడు వెంకటేష్‌కు ఐదు కార్లు గిఫ్ట్‌గా ఇచ్చిందెవరని ప్రశ్నించారు. ఖరీదైన విల్లాస్, ఫ్లాట్స్ భూములు ఎవరిచ్చారని ప్రశ్నించారు. డేగా టీం గాంగ్ స్టర్స్‌తో ఎంవివికి సంబంధం ఏమిటో తేల్చాలన్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో తిరిగి విచారణ జరపాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నాళ్లై స్థాయి వ్యక్తుల నుంచి పేద ప్రజల వరకు అనేక భూదందాలు మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, గన్నమనేని వెంకటేశ్వరరావు దోచుకు తిన్నారని ఆరోపించారు. వీటిపై సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎంపీ కాకముందు ఎంవివి.సత్యనారాయణ ఆస్తులు ఎంత, ఎంపీ అయిన తర్వాత ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. కొన్ని వేల కోట్లు దోచుకుని తిన్నారని ఆరోపించారు. ఎంవివి, జీవీలు రాజకీయ అధికారంతో పాటు రౌడీలు, గ్యాంగ్‌ల ద్వారా వేల కోట్ల ఆస్తులను సంపాదించారన్నారు. వీటన్నింటిపై సిబిఐ, ఈడీల ద్వారా పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు. ఆ ఆస్తులు ఎంవివికి ఎలా వచ్చాయి? ఎవరి ప్రమేయంతో వచ్చాయి? ఎక్కడి నుంచి డబ్బు తెచ్చి వీటిని కొనుగోలు చేశారు? వంటి అంశాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. నగరానికి ఒక ఎంవీవీ, జీవీ వుంటే నగరమంతా కబ్జాలకు గురయ్యే ప్రమాదముందని తెలిపారు. ఎంవీవీ, జీవీలకు గ్యాంగ్‌లు, రౌడీలతో ఉన్న సంబంధాలపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సుగర్‌పై అవగాహన అవసరం



ప్రజాశక్తి- గాజువాక : సుగర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఎండోక్రైనాలజి డాక్టర్ శ్రావణి తెలిపారు. అవగాహన కోసం ఈ నెల 12 నుంచి 18 తేదీ వరకు జాతీయ మధుమేహ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధుమేహంలో ప్రధానంగా టైప్ 1, టైప్ 2, గెస్టేషనల్ అంటే గర్భిణీ స్త్రీలలో వచ్చే మధుమేహం ఎక్కువగా చూస్తున్నామని తెలిపారు. మధుమేహంతో ఉన్న వారిలో దాదాపుగా 90 శాతం కన్నా ఎక్కువగా టైప్ 2 బాధితులేనని వివరించారు. మధుమేహం (డయాబెటిస్ మెల్లిటస్) ఉన్న వారిలో ఎక్కువగా కనిపించే లక్షణాలు తరచూ మూత్రం రావడం, ఆకలి, దాహం ఎక్కువగా ఉండటం, ఆకస్మికంగా బరువు తగ్గడం, ఎక్కువగా అలసట, కంటి చూపు మందగించటం/ మసక బారడం, అరికాళ్ల మంటలు, తిమ్మిర్లు, చర్మం మీద ఫంగల్ ఇన్ఫెక్షన్లు, తరచూ మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు, గాయాలు తొందరగా మానకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. అశ్రద్ధ వహిస్తే మధుమేహ వ్యాధి ప్రభావం తీవ్రమై గుండెపోటు, పక్షవాతం బారిన పడతారని తెలిపారు. ఎటువంటి వ్యాధి లక్షణాలు లేకున్నా సరే అధిక బరువుతో ఉన్నవారు, అధిక రక్తపోటు (బిపి), గుండె జబ్బులున్నవారు, తల్లిదండ్రుల్లో మధుమేహం, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్న వారు, శారీరక శ్రమ ఎక్కువగా లేనివారు రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా సుగర్ వ్యాధిని గుర్తించవచ్చని పేర్కొన్నారు. క్రమబద్ధంగా రక్త పరీక్షలు చేయించుకుంటూ, సరైన ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేస్తూ, వైద్యుల సలహా మేరకు మందులు వాడితే మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు.

విద్యుత్ అంతరాయంతో...

మంచినీటి సరఫరాకు ఆటంకం

ప్రజాశక్తి –గాజువాక : విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో దాని ప్రభావం మంచినీటి సరఫరాపై పడుతోంది. ప్రతిరోజూ నీటిని సరఫరా చేయాల్సిన జివిఎంసి గాజువాక జోన్ వాటర్ సప్లై అధికారులు ప్రస్తుతం మూడు నాలుగు రోజులకొకసారి సరఫరా చేస్తున్నారు. వారం రోజులగా కరెంటు కోతలు ఎక్కువ కావడంతో మోటార్ల ద్వారా వాటర్ ట్యాంక్‌లకు వెళ్లే నీటితో అవి పూర్తిగా నిండడంలేదు. దీంతో గాజువాకలో ఉన్న కొన్ని ప్రాంతాల ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సనత్‌నగర్, చినగంట్యాడ, కణ్ణవానిపాలెం, నడుపూరు ప్రాంతాల్లో మూడు రోజులుగా నీరు అందలేదని స్థానికులు చెప్పున్నారు. నిర్వాసిత కాలనీలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీరు లేక వంటిల్లు జంక్షన్ వద్ద ఉన్న కొన్ని హోటల్స్ ఉదయం, మధ్యాహ్నం మానేసి రాత్రిపూట మాత్రమే హోటల్ నడుపుతున్నారు. గతంలో ఇళ్లల్లో 90 నుంచి 120 అడుగుల వరకు బోరు కోసం తవ్వేవారు. ఇప్పుడు నీరు చాలక పాత బోర్లలోనే 150 నుంచి 200 అడుగుల వరకు మళ్లీ తవ్వుతున్నారు. దీనికి వారికి రూ.లక్ష వరకు అదనపు ఖర్చవుతుంది. పేదలు ఈ సాహసం చేయలేకపోతున్నారు. వీధుల్లో ఉన్న బోర్లు పని చేయడంలేదు. కొండవాలు ప్రాంతాలైన దయాల్‌నగర్, అంబేద్కర్ కాలనీ, సింహగిరికాలనీ, పెంటయ్యనగర్ ప్రాంతాల్లో మంచినీటి ఇబ్బంది తీవ్రంగా ఉంది. రోజుకు 5 కేనులు నీటిని కొనుగోలు చేస్తున్నారు. విద్య, వైద్యం కోసం ఖర్చు ఎలాగూ పెరిగింది. ప్రస్తుతం మంచినీటి కోసం కూడా ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై నీటి సరఫరా ఇంజినీర్ కేదారినాథ్‌ను వివరణ కోరగా విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, దానివల్ల కొన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా ఆలస్యం అవుతుందని తెలిపారు. అవకాశమున్నంతవరకు సర్దుబాటు చేస్తున్నామని చెప్పారు.

తాడిని సురక్షిత ప్రాంతానికి తరలించాలి

- అంతవరకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలి
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం
- కాపీలను కలెక్టర్, డిఆర్ఒకు అందజేసిన నాయకులు

ప్రజాశక్తి-పరవాడ

ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న మండలంలోని తాడి గ్రామాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆర్డర్ కాపీని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు, డిఆర్ఓ దయానిధికి మాజీ జెడ్పిటిసి మాదంశెట్టి నీలబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కాలుష్యం వల్ల తాడి గ్రామం పడుతున్న ఇబ్బందులపై కేసు వేసిన విషయం విధితమే. దీనికి స్పందించిన గ్రీన్ ట్రిబ్యునల్ తాడి గ్రామాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని, అంతవరకు అదనపు ల్యాండ్ ఫీల్ నిలుపుదల చేయాలని, గ్రీన్ బెల్ట్ బఫర్ జోన్ నిబంధనలు అమలు చేయాలని, కాలుష్యం నుండి కాపాడాలని, సురక్షితమైన మంచినీటిని సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఆర్డర్ కాపీలను కలెక్టర్, డిఆర్ఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు గనిరెడ్డి కనకరాజు, కోమటి సూరిబాబు, ముమ్మిన సూరి అప్పారావు, జి నూకరాజు, కోమటి కులదీప్ రాజ్, కోమటి అచ్చిబాబు, గుమ్మాల రాము, కోరుకొండ పైడ్రాజు, సాలాపు రమణ, దానబోయిన నీలకంఠరావు, జి.శ్రీనివాసరావు, గొల్లవెల్లి సత్తిరాజు, కోమటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



డిఆర్ఒకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న నాయకులు

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కశింకోట

ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కశింకోట మండల విద్యాశాఖాధికారి చిట్టిబాబు అన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థి రూ.6,500 చెల్లించాలని సూచించారు. పాఠశాలలు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలు తెరవకూడదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎంఇఒ

ఎన్‌టిపిసి సింహాద్రిలో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రిలో దక్షిణ ప్రాంత స్టేషన్‌ల త్రైమాసిక పనితీరు సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. అన్ని ఎస్ఆర్ బొగ్గు స్టేషన్‌ల పనితీరును ఎస్‌హెచ్ రవీంద్ర కుమార్, డైరెక్టర్ (ఆపరేషన్స్) సమీక్ష చేశారు. భద్రతపై దష్టిని పెంచడం, బలవంతంగా పాక్షిక నష్టాన్ని తగ్గించడంపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ ప్రకాష్ ఆర్ఇడి (సౌత్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరిందమ్ సిన్హా, ఈడి (షిఫ్ట్ సిసి) విజయ్ ప్రకాష్, ఈడి (రామగుండం తెలంగాణ) ఆర్‌కె పాండు, సీజీఎం (సింహాద్రి). సంజయ్ కుమార్ సిన్హా, ఆన్‌లైన్ మోడ్ ద్వారా కనెక్ట్ చేయబడిన సీఈవో (ఎన్‌టిఈసిఎల్ వల్లూర్) ఏకే మనోహర్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని రద్దు చేయడం పట్ల అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం కార్యదర్శి విల్లూరి రాము హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన రామానాయుడుకు జలవనరుల శాఖ మంత్రి పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లలో వ్యవసాయం నిర్వీర్యమైందని, సాగు నీటి ప్రాజెక్టులు అటకెక్కాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రానికి ఇరిగేషన్ జిల్లా కార్యాలయాన్ని తీసుకురావాలని, శారదా నదిపై గ్రోయిన్లు, పంట కాలువలను మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పీలామురళి, కాండ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్‌లో అరుణకు స్వర్ణ పతకం

ప్రజాశక్తి -అనకాపల్లి

కర్ణాటక రాష్ట్రంలోని బివివి సంఘ క్యాంపస్, విద్యగిరి, బగుల్ కోటెలో ఈ నెల 10 నుండి 13 వరకు జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ (మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్) సీనియర్ కేటగిరి 70కేజీ కాంపిటేషన్‌లో అనకాపల్లి మండలం మారేడుపూడి తారకరామ కాలనీ ఫిట్నెస్ బాక్సింగ్ క్లబ్ తరపున పాల్గొన్న కోరుకొండ అరుణ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షులు మల్ల సురేంద్ర స్వగృహంలో శనివారం కోరుకొండ అరుణని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా మల్ల సురేంద్ర మాట్లాడుతూ ముందు ముందు అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్ రంగంలో అనకాపల్లికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ ఆర్ వెంకటేష్, దువ్వాడ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



అరుణను అభినందిస్తున్న మళ్ల సురేంద్ర

ఎన్‌డిఎ కూటమి విజయోత్సవ సభ



ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సత్కరిస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి - పరవాడ

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఎన్‌డిఎ కూటమి విజయోత్సవ సభ శనివారం పరవాడలో జరిగింది. ఇందులో పాల్గొన్నా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంలోని మహిళల ఉపాధి కోసం ప్రాజెక్టును ఏర్పాటు చేస్తానని చెప్పారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ రాంకీ ప్రాజెక్టులో 10 చిన్న కంపెనీలు, 10 భారీ కంపెనీల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జి మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని విషయాలు తనకు తెలియజేయాలని, ఎవరికి నచ్చినట్లు వారు చేసుకుంటూపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం రమేష్, పంచకర్ల, బాబ్జిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పీలా శ్రీనివాసరావు, మాధవ్, గొర్ల రామనాయుడు, పైల జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు, నీలబాబు, కొన్నూరు వెంకటరమణ, బోద్దపు శ్రీనివాస్ కాసులు, అట్టా సన్యాస అప్పారావు, చింతకాయల ముత్యాలు, బోద్దపు వెంకటరమణ, బుగిడి రామ గోవిందరావు, వియ్యపు చిన్న, పైల సన్యాసిరావు, మోటూరు సన్యాసినాయుడు, దుల్ల రామునాయుడు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

ప్రజాశక్తి-చోడవరం

పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగింది. శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... చీడికాడ మండలం దిబ్బపాలెం గ్రామానికి చెందిన తంగుడుపల్లి మాత అనే గర్భిణికి శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు ఆమెను పరీక్షించి ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రహించారు. మాతకు మొదటి కాన్పు కావడంతో పాటు ఉమ్మనీరు లేకపోవడంతో నొప్పులు కూడా నిలిచిపోయి ఆమె పరిస్థితి విషమంగా ఉందని, తక్షణం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించాలని, సిజేరియన్ ఆపరేషన్ అవసరం పడవచ్చని చెప్పారు. దీంతో 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మార్టూరు జంక్షన్ వద్ద మాతకు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో ఈఎంటి యేడువాక అప్పలనాయుడు చాకచక్యంగా వ్యవహరించి అంబులెన్స్ ఆపి పైలెట్ అల్లి కోటిపల్లి, ఆశా కార్యకర్త సహాయంతో డెలివరీ అయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. మాత మగ బిడ్డ జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. సాహసోపేతంగా ప్రసవం జరిగేందుకు ప్రయత్నించిన అంబులెన్స్ సిబ్బంది ఏఎన్ఎంలకు భర్త మోహనరావు, బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.



అంబులెన్స్‌లో ప్రసవించిన దృశ్యం

హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -అనకాపల్లి

వెంకటగిరి శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లమో కోర్సుల ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్‌వి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రెండు మూడు సంవత్సరాల లెదర్ ఎంట్రీ కోర్సుకు ఈనెల 20న స్పాట్ అడ్మిషన్‌కు పదవ తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ, ఐటిఐ చదివిన వారికి నేరుగా రెండవ సంవత్సరంలో అడ్మిషన్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. 15 నుంచి 23 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, ఎస్‌సిఎస్‌టి అభ్యర్థులకు గరిష్టంగా 25 సంవత్సరాల వయోపరిమితి ఉందన్నారు. మొదటి సంవత్సరం 1100, రెండవ సంవత్సరం 1200 స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8008705688, 9703424768 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి వాసవిమాత ఆలయం ప్రాంగణంలో వాసవి క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షులు కె.రవిచంద్రన్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదనందిపల్లి వాసవి క్లబ్ పనితీరు బాగుందంటూ కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నరు వై.నరసింగరావు, జోన్ చైర్మన్ పి.రామకష్ణ, వనిత క్లబ్ సభ్యులు నాగ అప్పారావు, శ్రీనివాసరావు, రాజు, రోహిణి, లావణ్య, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి వైఎల్ కాంతమ్మ శనివారం అకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేస్తున్న విత్తనాలకు దుకాణ యజమానులు తప్పనిసరి బిల్లు ఇవ్వాలని, రైతులకు తెలిసే విధంగా ధరల పట్టిక బోర్డు బయట ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం దుకాణాల వల్ల సోనా మసూరి - 3291, సాంబా మసూరి - 5204, స్వర్ణ - 7029, శ్రీకాకుళం సన్నలు - 2537, ఆమర - 1064, పుష్యమి - 1075 రకాల విత్తనాలు మొత్తంగా 50 టన్నులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. రైతులు లైసెన్సు కలిగిన విత్తన దుకాణాల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసుకోవాలన్నారు.

ఎంపీ శ్రీభరత్‌కు వంశీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ ఎంపీగా భారీ మెజార్టీ సాధించిన ఎం.శ్రీభరత్‌ను విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం ఎంవిపి.కాలనీలోని ఎంపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. దక్షిణ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓట్లతో తొలి ఎమ్మెల్యేగా గెలుపొందడానికి సహకరించిన భరత్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నేతలు సునీల్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌లో దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-కశింకోట : మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తిరుపతి రావు ఆధ్వర్యంలో తేగాడ, కశింకోటలోని 5 ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ మందును శనివారం పిచికారీ చేశారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా, దోమల నియంత్రణకు ఈ మందు పిచికారీ చేయించిన్నట్లు డాక్టర్ తిరుపతిరావు చెప్పారు. సబ్ యూనిట్ అధికార్లు పరమానందరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ దోమలు మంచినీరు నిల్వ ఉన్నచోట గుడ్లుపెట్టి అభివృద్ధి చెందుతాయని, అవి వృద్ధి చెందకుండా ఉండాలంటే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. దోమ కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు వాడాలని, ఇంట్లో పొగ పెట్టి దోమలను తరిమివేయాలని కోరారు. జ్వరం వస్తే రక్త పరీక్షలు చేసుకుని, చికిత్సలు తీసుకోవాలన్నారు.

ముగిసిన ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్లో జిల్లా అర్చరీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు శనివారం ఘనంగా ముగిసాయి. ఈ పోటీలను జిల్లా అర్చరీ అధ్యక్షులు పి.సూర్యనారాయణ రెడ్డి ప్రారంబించగా జిల్లా నలుమూలల నుండి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరై పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు జిల్లా అర్చరీ సంఘ ఉప అధ్యక్షులు సత్యనారాయణ, సంస్కృతి గ్లోబల్ స్కూల్ సీఈఓ కె.నిశాంత్‌లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 22 నుండి 24 వరకు విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొనే విశాఖ జిల్లా బాల, బాలికల వివరాలను వెల్లడించారు. అండర్-10లో ఎస్.వి.శరత్, పి.ఠాగూర్, బి.విరాజ్, ఎల్.సాత్విక్, ఎన్.శశికాంత్, అండర్-13లో కె.నందిత, వి.ఆద్య, వి.కీర్తి. వి.లలిత్ సాయి, ఎన్.తేజేశ్వరరావు, కె.ఆశ్రీత్, ఎస్.తన్మాయ్, వి.యశస్వి, అండర్-15లో బి.మణీత్, నభ్య ప్రభాత్, ఎస్. రామ్ చైతన్య, బి.వైష్ణవి, కె.సాయి మనస్వి, పి.హర్షిత, పి.అరియనా పాల్గొంటారని తెలిపారు.

వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-కె.కోటపాడు : రైతులకు అన్ని రకాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుండి రిజిస్ట్రేషన్లు ప్రారంభించి రైతులకు విక్రయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది నుండి సొమ్ము చెల్లించిన వెంటనే విత్తనాలు తీసుకోవచ్చిని చెప్పారు. సాంబమసూరి, ఆర్‌జిఎల్, సోనామసూరి, ఎంటీయూ 1121, 1061, 1064, 1318, 1224 తదితర వరి రకాలు 934 క్వింటాళ్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అన్ని రకాల వరి విత్తనాలు ముందుగా మొలక కట్టిస్తున్నామని, మొలక శాతాన్ని పరిశీలించి రైతులు సంతృప్తి చెందిన తర్వాత మాత్రమే పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలన్నింటికీ విత్తనాలు సరఫరా చేస్తున్నామని, రైతుల వినియోగించుకోవాలని సూచించారు.

టిప్పర్ల కుంభకోణంపై దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో మొక్కలకు నీరు పోసే టిప్పర్ల నిర్వహణ సమయంలో కాంట్రాక్టర్లు అధికారులతో కలిసి పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడిన వ్యవహారంపై దర్యాప్తు జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం జివిఎంసి కమిషనర్‌కు ఈ మేరకు తాను ఫిర్యాదు చేసినట్టు మీడియాకు ఆయన తెలిపారు. జివిఎంసి 98 వార్డులలో మొక్కలకు నీరుపోసేందుకు 11 మంది గుత్తేదార్లు టెండర్లు దక్కించుకొని, మొక్కలకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా పోస్తున్నారన్నారు. ఇటీవల 2600 ట్రిప్పులు నీరుపోసామని, దానికి బిల్లులు చెల్లించాలని గుట్టుచప్పుడు కాకుండా రూ.60 లక్షలు కాజెయ్యాలనుకోవడం, అందుకు జివిఎంసి అధికారులు సహకరించడం దుర్మార్గమన్నారు. ఈ వ్యవహారంలో జిపిఎస్ నమోదు చేసినవి కేవలం 900 ట్రిప్పులు మాత్రమేనని బయటపడడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిందన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టం

- విశాఖ రైల్వే జోన్‌తో పాటు పరిశ్రమలు తెస్తాం
- అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్

ప్రజాశక్తి-అనకాపల్లి

గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డ ఏ ఒక్క అధికారిని విడిచి పెట్టేది లేదని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ వెల్లడించారు. స్థానిక బైపాస్ రోడ్లో ఎంపీ క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లఓ మైనింగ్, లిక్కర్ అనేక కార్పొరేషన్ల ద్వారా జరిపిన చెల్లింపుల్లో భారీ అవినీతి జరిగిందన్నారు. ప్రధానంగా డిప్యూటేషన్‌పై వచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించిన వాసుదేవ రెడ్డి, వెంకటరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కేవివి సత్యనారాయణ వంటి అధికారుల అవినీతిపై విచారణ జరిపించి శిక్ష పడేదాకా ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు స్థాపిస్తామన్నారు. జిల్లాలో సహకార చక్కర కర్మాగారాలను ఇథనాల్ ఫ్యాక్టరీలుగా మార్చి ఈ జిల్లా రైతాంగానికి మేలు చేస్తామని చెప్పారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాధవ్, టిడిపి, బిజెపి నేతలు బత్తుల తాతయ్య బాబు, దాడి రత్నాకర్, ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, విల్లూరి రాము, ఎ.కొండబాబు రాజాన అప్పారావు, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం.రమేష్‌కు సత్కారం

ఎంపీ సీఎం రమేష్ శనివారం నూకంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, యువ నాయకులు దాడి జైవీర్ గజమాలతో సత్కరించారు. సీఎం రమేష్‌ను మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ శనివారం ఎంపీ కార్యాలయంలో అభినందించి స్వీటు తినిపించారు. పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సిఎం.రమేష్, చిత్రంలో తాతయ్యబాబు, రత్నాకర్ తదితరులు

5 లక్షల హెక్టార్లలో పామాయిల్ పంట సాగే లక్ష్యం



పామాయిల్ తోటలను పరిశీలిస్తున్న మల్లేశం పూల తదితరులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 5 సంవత్సరాల్లో భారతదేశంలో 5 లక్షల హెక్టార్లలో పామాయిల్ పంటను సాగు చెయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పతంజలి పుడ్స్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంటు మల్లేశం పూల పేర్కొన్నారు. మలేషియా, ఇండేనేషియాకి సమాంతరంగా ప్రస్తుతం మన దేశంలోని 12 రాష్ట్రాల్లో తమ సంస్థ సహకారంతో సుమారు 50 వేల మంది రైతులు 80 వేల హెక్టార్లలో పామాయిల్ పంటను సాగు చేస్తున్నారని చెప్పారు. దేవరాపల్లిలో కిలపర్తి భాస్కరరావు తదితర రైతులు సాగు చేస్తున్న పామాయిల్ తోటలను శనివారం ఆయన తన బృందంతో కలిసి పరిశీలించారు. మొక్క చనిపోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు పంట దిగుబడిని పెంచుకోడానికి అవసరమైన మెలకువల్ని ఆయన రైతులకు తెలియజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో 80 శాతం, తెలంగాణాలో 15 శాతం, మిగతా రాష్ట్రాల్లో కేవలం 5 శాతం ఈ పంటను పండిస్తున్నారని తెలిపారు. నేషనల్ మిషన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం ద్వారా స్వయం సమృద్ధి (వంట నూనెల అభివృద్ధి) సాధనలో భాగంగా పామాయిల్ పంట సాగుకు ప్రోత్సాహం అందుతోందని చెప్పారు. ప్రస్తుతం టన్ను ధర రూ.13,284 ఉందన్నారు. ఆయన వెంట సంస్థ జనరల్ మేనేజరు టివి.రమణ, అసోసియేట్ జనరల్ మేనేజరు పట్టాభి రామిరెడ్డి, మేనేజరు చంద్రశేఖర్, కె.రమేష్, బివి.సురేష్ తదితరులన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ పట్నాయక్

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో బిఎస్‌కెఎన్.పట్నాయక్ అన్నారు. మండలంలోని కొరువాడ, వి.సంతపాలెం గ్రామ సచివాలయాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలు అవసరాల కోసం మండల కేంద్రానికి రాకుండా సచివాలయాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఎంపిడిఓ వెంట ఈఓపిఆర్డి ప్రసాదు ఉన్నారు.

బక్రీద్ సందర్భంగా బందోబస్తు

ప్రజాశక్తి-అనకాపల్లి : జూన్ 17వ తేదీన ముస్లిములు బక్రీద్ జరుపుకోనున్న నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకునే విధంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. గోవులను ఒక చోట నుండి మరొక చోటుకు తరలించే క్రమంలో తగిన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని, లేనిచో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గోవుల రవాణాపై నిరంతరం గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే, ప్రజలు వెంటనే అప్రమత్తమై అనకాపల్లి జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్ 94409 04229కు సమాచారాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

21 వరకు యోగా శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-చోడవరం : ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ విద్యాసంస్థలో ఈ నెల 15 నుండి 21వ తేదీ వరకు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లేటి సతీష్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులకు ఈ శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పని ఒత్తిడికి లోనై మానసిక ఆరోగ్యం ప్రజల్లో క్షీణిస్తుందని, అటువంటి రుగ్మతలను ఎదుర్కోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9291276900 నెంబర్‌కు సంప్రదించాలని సతీష్ కోరారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ ఆదేశించారు. బడి బయట పిల్లలను "నేను బడికి పోతా" జిల్లా ఎన్రోల్మెంట్ డ్రైవ్ కమిటీ సమావేశం జిల్లా విద్యా అధికారి కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో వెంకట లక్ష్మమ్మ మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచనలు, షెడ్యూల్, రోజువారీ కార్యాచరణ ప్రణాళికతో ఉత్తర్వులు విడుదల గూర్చి వివరించారు. జిల్లా, మండల, హేబిటేషన్ కమిటీలు ఆధ్వర్యంలో డ్రైవ్ జూన్ 13 నుంచి జూలై 12 వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు. ఎంపిడిఒలను సమన్వయం చేసుకొని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కమిటీ సభ్యులతో సిఆర్పిఎస్, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి పాల్గొన్నారు.

కె.కోటపాడు : బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించడానికి ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బిఎస్‌కెఎన్.పట్నాయక్ అన్నారు. శనివారం స్థానిక ఎంఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. 6 నుండి 14 సంవత్సరాల పిల్లలందరూ బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కె.సత్యనారాయణ, డివిడి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ఈదురుగాలులతో భారీ వర్షం

- పిడుగుపాటుకు రైతు మృతి - కూలిన చెట్లు



రావికమతంలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:రావికమతం మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో, గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. రోడ్డు పక్కన షాపులకు సంబంధించిన బోర్డులు నేల కొరిగాయి.

కొత్తకోట:పిడుగు పాటుకు గురై రైతు మృతి చెందిన సంఘటన రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాజాన పెంటయ్య (50) శనివారం సాయంత్రం గ్రామ సమీప వ్యవసాయ పాకల వద్ద పశువులను మేపుతున్నాడు. సుమారు నాలుగు గంటల సమయంలో పెంటయ్యకు సమీపంలో పిడుగు పడింది. దీంతో పెంటయ్య సంఘటనా స్థలంలో మృతి చెందాడు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెంటయ్య కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.



నక్కపల్లిలో ఒరిగిన చెట్టు

కోటవురట్ల:ఎండపల్లి గ్రామం వద్ద శనివారం మూడు గంటల సమయంలో వీచిన బలమైన గాలులకు చింత చెట్లు కూలి రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అధికారులు జెసిబి సహాయంతో కూలిన చెట్లను తొలగించి ప్రయాణికుల రాకపోకలు పునరుద్ధరించారు.

ఈ విషయమై రహదారులు భవనాల ఇంజనీరు రెడ్డిని వివరణ కోరగా... నర్సీపట్నం-పోలవరం రోడ్డులో దాదాపుగా ఇటువంటి పురాతన చింత చెట్లు అత్యధికంగా ఉన్నాయని తెలిపారు. తరచూ రోడ్లపై చెట్లు కూలి అంతరాయం ఏర్పడుతుండటంతో వీటిని తొలగించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. గాలులకు విద్యుత్కు అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నక్కపల్లి:మండలంలోని ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలుచోట్ల చెట్లు విద్యుత్ స్తంభాలపై విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నక్కపల్లిలో తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో విద్యుత్ స్తంభం పై కొబ్బరి చెట్టు పడిపోవడంతో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు తహసిల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం మధ్యాహ్నం చెట్టును తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. శుక్రవారం సాయంత్రం వీచిన బలమైన గాలులకు పలు గ్రామాల్లో మామిడికాయలు నేలరాలాయి. ఇరటి చెట్లు విరిగిపోయాయి .దీంతో రైతులు నష్టపోయారు .



కోటవురట్ల మండలంలో కూలిన చెట్టు

గొలుగొండ:మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ విపరీతంగా కాయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురిసింది.కృష్ణదేవిపేట, సీహెచ్.నాగాపురం, చోద్యం, లింగంపేట, జోగంపేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడింది.

దేవరాపల్లి :దేవరాపల్లి మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో స్థానిక నాలుగు రోడ్ల కోడలిలో భారీ వృక్షం నేలకూలి విద్యుత్ వైర్లపై పడ్డాయి. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది హుటాహుటిన వైర్లు తొలగించి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేశారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది పరిసర ప్రాంతాలలో శనివారం సాయంత్రం గాలి వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మండలంలోని ఎల్బీ అగ్రహారం వాటర్ ట్యాంక్ వద్ద చెట్టు విద్యుత్ వైర్లుపై పడి నిప్పులు చెలరేగాయి. స్థానిక విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి వైర్లుపై ఉన్న చెట్టుకొమ్మలను తొలగించారు. ఈ వర్షం మినప, పెసర, బొబ్బరి, కంది పంటలకు నష్టంగా చేకూర్చినా, చెరుకు పంటకు లాభదాయకమని రైతులు చెప్పారు.

రంగురాళ్ల తవ్వకాల కలకలం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి రంగురాళ్ల తవ్వకాలు కలకలం రేపాయి. అటవీ సిబ్బంది పర్యవేక్షణలో ఉండే బేస్ క్యాంపునకు ఆనుకుని ఈ తవ్వకాలు జరగడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఏడాదికాలం క్రితం రంగురాళ్ళ క్వారీ బయటపడింది. గతంలో తవ్వకాలు జరిగిన నాటి నుండి అటవీ శాఖ ఆధ్వర్యంలో క్వారీ ప్రాంతంలో బేస్ క్యాంప్‌ని నిర్వహిస్తున్నారు. నిత్యం ఇద్దరు సిబ్బందితో రాత్రి, పగలు పహారా కాస్తున్నారు. అయినప్పటికీ శుక్రవారం రాత్రి క్వారీలో తవ్వకాలు జరగడం పలు అనుమానాలను కలిగిస్తుంది. నిత్యం సిబ్బంది పహారాలో ఉన్న క్వారీలో తవ్వకాలు జరిగాయంటే సిబ్బంది సహకారం ఉన్నట్టా? లేనట్టా?. సిబ్బంది సహకారం లేకుండా తవ్వకాలు ఎలా జరుగుతాయని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. శనివారం ఉదయం పత్రికా విలేకరుల బృందం క్వారీ ప్రాంతాన్ని పరిశీలించగా మట్టి తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. రాత్రి సమయంలో తవ్విన మట్టి నుండి లక్షల రూపాయలు విలువచేసే రంగురాళ్లు చేతులు మారాయని పలువురు బహిరంగంగానే చర్చించు కుంటున్నారు. క్వారీలో అధికారులకు తెలియకుండా తవ్వకాలు జరిగే పరిస్థితి లేదు. దీనిపై అటవీ శాఖకు చెందిన ఉన్నతాధికారులు దృష్టి సారించి తవ్వకాలు జరగడానికి కారణాలను వెలికి తీయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ఈ విషయాన్ని అటవీశాఖ నర్సీపట్నం సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా క్వారిలో తవ్వకాలు ఎక్కడా జరగలేదన్నారు.



రంగురాళ్లను తవ్విన అటవీ ప్రాంతం



సత్కరిస్తున్న అప్పలరాజు

రెడ్డి సత్యనారాయణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మాడుగుల: మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ 99వ జన్మదిన వేడుకల్లో మాడుగుల మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు. శనివారం మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ గ్రామం పెద్దగోవాడ స్వగృహంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో పుప్పాల అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు కలసి సత్కరించారు. ఈనెల 18న జరిగే మోదకొండమ్మ పండుగ మహోత్సవానికి ఆహ్వాన పత్రిక అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల తెలుగుదేశం నాయకులు రంజిత్ వర్మ, లెక్కలు కాశి బాబు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడినాయుడు, పి సూర్యనారాయణరాజు, కుప్పిలి భవాని శంకర్, పొట్నూరి కుమార్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రజాశక్తి-కోటవురట్ల: ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో వైసిపి మండల స్థాయి సమావేశం శనివారం తంగేడు గ్రామంలో నిర్వహించారు. వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనువాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ, గెలుపు ఓటములు సహజమన్నారు. కష్టించి పనిచేసినా ఫలితం లేకపోవడంపై ఎవరూ నిరాశ చెందవద్దన్నారు.ఈ సందర్భంగా పలువురు వైసిపి ఓటమికి గల కారణాలపై అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామస్థాయి నాయకులను పట్టించుకోకపోవడంతో ఓటమి పాలయ్యామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో నాయకులకు సముచిత స్థానం లభించకపోవడమే ప్రధాన కారణమని మండల ఉపాధ్యక్షులు దత్తుడు రాజు అన్నారు. పందూరు, జల్లూరు వంతెనలు అసంపూర్తిగానూ, అడ్డు రోడ్డు ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటం ఓటమికి కారణమని మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రేణులు ఎవరు అధైర్య పడవలసిన పనిలేదని ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు నిలదీయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షులు రమేష్, సిద్ధ బత్తుల సత్తిబాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-చీడికాడ:రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారిని రమాదేవి, గ్రామ వ్యవసాయ సహాయ అధికారి గణేష్ తెలిపారు. మండలంలో జేబీపురం రైతు భరోసా కేంద్రం, చీడికాడ, జి.కొత్తపల్లి, జె.బి.పురం, తునివలస, వింటిపాలెం గ్రామాల్లోని రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, రాజబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, ధర్మిశెట్టి అప్పలనాయుడు, పేరపు కొండబాబు, కొట్యాడ చిన్నమనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: రావికమతం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం స్థానిక శాసనసభ్యులు కే ఎస్ఎన్ఎస్ రాజు రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రాజు మాట్లాడుతూ, రైతాంగానికి ఎరువులు, విత్తనాలు, పనిముట్లు అందుబాటులో ఉంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు, స్థానిక సర్పంచ్ గెంజి మోది నాయుడు, గెంజి ఈశ్వరరావు, వ్యవసాయ మండల వ్యవసాయ అధికారిని రూప తదితరులు పాల్గొన్నారు.



బిందెలు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

స్టీల్ బిందెలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి వేత్త పెనుగొండ బంగారం 83వ పుట్టినరోజు వేడుకలను శనివారం కొత్తకోట శివ కేశవ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా డీసీఎంస్ డైరెక్టర్ సత్యదేవ్, గ్రామ సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, టిడిపి సీనియర్ నాయకులు కోట గోవిందరావు చేతుల మీదుగా కేక్ కట్ చేశారు అనంతరం 83 మంది నిరుపేద వృద్ధులు, పారి శుధ్య కార్మికులకు స్టీల్ బిందెలను పంపిణీ చేశారు.వ్యాపార వేత్త పెనుగొండ బంగారంను సర్పంచ్ తోపాటు గ్రామ నాయకులు, ఆర్య వైశ్యులు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య ప్రతినిధులు గున్నాజీరావు, పెనుగొండ నూకేశ్వరరావు, పెనుగొండ వాసు, వందవాసి శ్రీనువాసు తదితరులు పాల్గొ న్నారు....

విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలోని పెద్దగూడ గ్రామ పంచాయతీకి చెందిన జర్రీపూడి గ్రామంలో విద్యుత్ స్తంభాన్ని తాకడంతో రెండు మేకలు మృతి చెందాయి. జర్రిపూడి గ్రామంలో శనివారం అకాల వర్షానికి విద్యుత్ స్తంభాలకు సరఫరా కావడంతో వాటిని తాకిన ఒలుగు రాంబాబుకు చెందిన రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి బాధితుడికి నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలని గ్రామస్తులు కోరారు.



మృతి చెందిన మేకలు

జెన్కో ప్రాజెక్ట్ కోసం..
గ్రామాలు ఖాళీ చేయిస్తే ప్రతిఘటన : సిపిఎం

ప్రజాశక్తి-పాడేరు:జెన్కో నిర్మించే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం గ్రామాలు ఖాళీ చేయాలని ఆదివాసీలను వేధిస్తుండటంపై సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నరస తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సీలేరు లో ఉన్న జెన్కో ప్రోజెక్ట్ విస్తరణకు కొత్త ప్రాజెక్ట్ నిర్మాణం కోసం పార్వతి నగర్‌ను ఖాళీ చేయాలని ఆదివాసీలకు అధికార్లు వేధిస్తున్నారన్నారు. సీలేరులో గ్రామ సభను గత ఏడాది నిర్వహించిన అధికారులు ఆదివాసీలకు వాస్తవాలు తెలపకుండా అరకొర సమాచారంతో గ్రామ సభ ఆమోదం తెలియజేసేసారన్నారు. గ్రామసభ ఆమోదం నివేదికతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఆదివాసీలు నివసిస్తున్న గ్రామాలు ఖాళీ చేయాలని చెబుతుండటం అన్యాయమన్నారు.

మంత్రి అనితకు బ్రహ్మారథం

- దారి పొడువునా సాదర స్వాగతం - తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర హెూంశాఖ, విపత్తుల నిర్వహణ మంత్రి వంగలపూడి అనితకు కూటమి శ్రేణులు బ్రహ్మారథం పట్టారు. మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించిన తర్వాత మొదటిసారిగా ఆమె శనివారం పాయకరావుపేట నియోజకవర్గంలో అడుగు పెట్టడంతో పార్టీ శ్రేణులు ఉరికే ఉత్సాహంతో దారి పొడవునా అపూర్వ ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆమె పాయకరావుపేటలో శనివారం సాయంత్రం అడుగు పెట్టడంతో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్థానిక పాండురంగ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నరిశే వెంకటాద్రి, అర్చకులు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో అనితకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అనితకు అందజేశారు.



అనితకు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న నాయకులు

అనంతరం ఆమె పాయకరావుపేట నుండి జాతీయ రహదారి మీదగా పెనుగొల్లు ధర్మవరం వరకు ర్యాలీగా బయలుదేరారు. ఆమె కు ఆయా గ్రామాల్లో ప్రధాన జంక్షన్ల వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు ఆమెకు పూలమాలలు, బొకేలు అందించి స్వాగతం పలికారు. నక్కపల్లి లో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, మీగడ సత్తిబాబు, పెంకుల రాజు, ఆడ్డూరి లోవరాజు, క్రరీ వెంకట సత్యనారాయణ, అడ్డూరి నాగభూషణం, సన్యాసిరావు తదితరుల ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో గజమాలతో ఆమెను సత్కరించారు. తప్పట గుళ్ళు, కోలాటాలు, డీజే వంటి ప్రదర్శన, భారీ మందు గుండు సామాగ్రి పేల్చారు. నాయకులు కొప్పిశెట్టి కొండబాబు ,కొప్పిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.
వేంపాడు జాతీయ రహదారిపై అయినంపూడి అప్పలరాజు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. హోం మంత్రి అనితకు భారీగా పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు .



నాయకులు, ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి అనిత

సౌత్‌జోన్ పోటీల్లో ప్రియాంక సత్తా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 10 నుండి 14 వరకు కర్ణాటక రాష్ట్రంలో జరిగిన దక్షిణ అఖిల భారత ఉమెన్ (సౌత్ జోన్) నేషనల్ ఉషు టోర్నమెంట్‌లో నర్సీపట్నంకు చెందిన వేపాడ ప్రియాంక సిల్వర్ మెడల్ సాధించారు. 70 కేజీల విభాగంలో ఆడి ద్వితీయ స్థానంలో నిలిచి ఈ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ నేషనల్ టోర్నమెంట్‌లో మెడల్ సాధించడంపై ఆంధ్రా ప్రదేశ్ వూషు అసోసియేషన్ సెక్రటరీ మోహన్ ముత్యాలరావు, నేషనల్ రిఫరీ వెంకట్, శాప్ కోచ్ అబ్బు అభినందించారు.



మెడల్ చూపుతున్న ప్రియాంక